ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక


యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 203

సోమవారం 27 జనవరి 2025 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD



దేశం ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంది. ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము న్యూ ఢిల్లీలోని కర్తవ్య పథ్ నుండి గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోవడంలో జాతికి నాయకత్వం వహించారు. యాదగిరిగుట్ట ఎస్.వీ.ఎన్ లో గణతంత్రదినోత్సవ వేడుకలు అంబరాన్నంటాయి.




# జనం వద్దకే వస్తున్నాం.. జవాబుదారీగా ఉంటాం



## మా ప్రభుత్వంలో ప్రజలే రాజులు

- కొడంగల్‌లో పరిశ్రమల ఏర్పాటును కేసీఆర్ అడ్డుకుంటున్నారు
- 13 నెలలుగా ప్రతిపక్ష నేత అసెంబ్లీకే రాలేదు
- అర్ధరాత్రి నుంచే రైతు ఖాతాల్లో నగదు
- మార్చి 31 దాకా 4 పథకాల నిరంతర అమలు: సీఎం రేవంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శలు
- కోస్గి మండలం చంద్రవంచలో నూతన పథకాలకు శ్రీకారం

'మా ప్రభుత్వంలో ప్రజలే రాజులు.. వారికి మేం జవాబుదారీగా ఉంటాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గత పాలకుల్లా పాలన చేద్దామంటే కుదరదని, ప్రజల వద్దకే వెళ్లాలని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించేలా మార్పు తీసుకొచ్చామన్నారు. అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు.. ముఖ్యమంత్రి కూడా ప్రజల వద్దకే వస్తున్నారని చెప్పారు. నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో ఆదివారం ఆయన కొత్త రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను లాంఛనంగా ప్రారంభించారు. ఒక్కో పథకానికి ఐదుగురి చొప్పున ఎంపిక చేయగా వారికి సీఎం మంజూరు ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసి సభలో ఆయన మాట్లాడారు.

**మహబూబ్‌నగర్, రోమింగ్‌న్యూస్:** ఇచ్చిన మాట ప్రకారం గత ఆగస్టు 15న రాష్ట్రంలో 22.50 లక్షల మంది రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశాం. మొదటి విడత రైతు భరోసా కింద రూ.7వేల కోట్ల పెట్టుబడి సాయం రైతుల ఖాతాలో జమ చేశాం. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం వృథాగా మారినా 1.56 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన సన్న ధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చాం. ఎన్నికల ముందు ములుగు, వరంగల్, నిజామాబాద్ ప్రాంతాల్లో పర్యటించినప్పుడు భూములున్న వారికే రైతుబంధు ఇస్తున్నారని, పేద కూలీలకు చేయూత అందించాలని భావించాం. అధికారం లోకి వచ్చాక మంత్రులతో చర్చించి భూమి లేని వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.12వేల ఆర్థికసాయం అం దించేందుకు నిర్ణయించాం. దీనిద్వారా రాష్ట్రం లో భూమి లేని 10 లక్షల

మిగతా 2 లో

02

## రాష్ట్రాల వర్సిటీలపై కేంద్రం ఆధిపత్యమా...

- యూజీసీ ప్రతిపాదనలు రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధం
- ఉపసంహరించుకోవాలని ప్రధానిని కోరుతున్నాం
- అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి

## రాజ్యాంగ విలువలపై విశ్వాసమే

# గణతంత్ర దినోత్సవం

### ఇది బలమైన, సంపన్నమైన దేశాన్ని నిర్మించే దిశగా మన ప్రయత్నాలను బలోపేతం చేస్తుంది

### రిపబ్లిక్ డే వేడుకలో ప్రధాని నరేంద్ర మోదీ



76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. ఈ రాజ్యాంగాన్ని రూపొందించి.. ప్రజాస్వామ్యం, గౌరవంతో పాటు ఐక్యతగా దేశ అభివృద్ధి ప్రయాణం సాగేలా కృషి చేసిన మహనీయులందరికీ ఈ సందర్భంగా నివాళు లర్పిస్తున్నా. ఈ వేడుక మన రాజ్యాంగ విలువలను కాపాడుతుందని, బలమైన, సంపన్నమైన దేశాన్ని నిర్మించే దిశగా మన ప్రయత్నాలను బలోపేతం చేస్తుందని ఆశిస్తున్నా' అని మోదీ ఎక్స్లో పోస్టు చేశారు.

**న్యూఢిల్లీ రోమింగ్‌న్యూస్:** దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. రిపబ్లిక్ డే అనేది భారత రాజ్యాంగ విలువలపై విశ్వాసం, సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్యంపై అంకితభావానికి చిహ్నం. బలమైన గణతంత్రానికి

మిగతా 2 లో

## కేంద్రంతో నిర్మాణాత్మక సంబంధాలు

### సంపద, సామరస్యం వైపు తెలంగాణ పయనం

- రైతులు, మహిళల కోసం ఎన్నో కార్యక్రమాలు
- బలహీన వర్గాల సంక్షేమానికి రూ.9,200 కోట్లు
- గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**హైదరాబాద్, రోమింగ్‌న్యూస్:** "కేంద్ర ప్రభుత్వం తో స్నేహపూర్వక, నిర్మాణాత్మక సంబంధా లను కొనసాగిస్తాం. మన రాజ్యాంగంలో పొందుపరిచిన సమాఖ్య స్ఫూర్తికి తెలం గాణ నిజమైన ఉదాహరణ. ప్రజా వాణి వంటి కార్యక్రమాలు పౌరులు, ప్రభుత్వం మధ్య ప్రత్యక్ష, పరస్పర

మిగతా 2 లో



రైతుభరోసా సొమ్ము నేటి నుంచి

## బ్యాంకుల్లో తీసుకోవచ్చు

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## అన్ని గ్రామాల్లో పథకాలు అమలు చేయకపోతే రణరంగమే

03

మాజీ మంత్రి కేటీఆర్

# ఇక అధికారుల పాలన

- 120 మున్సిపాలిటీలు, 9 కార్పొరేషన్‌లకు ముగిసిన గడువు
- ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు




**హైదరాబాద్, రోమింగ్‌న్యూస్:** రాష్ట్రం లోని 120 మున్సిపాలిటీలు, 9 కార్పొరేషన్లు ఇక 'ప్రత్యేక' పాలన లోకి వెళ్లాయి. వీటి పదవీకాలం ఆదివారం ముగి యడంతో అర్ధ రాత్రి నుంచి ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. రాష్ట్రంలో 2020 జనవరి 22న మున్సిపల్ ఎన్నికలు జరగ్గా అదేనెల 27వ తేదీన పాలకమండళ్లు కొలు వుతీ రాయి. దీంతో ఆదివారం ఆయా మున్సిపాలిటీలు, కార్పొ రేషన్లకు ప్రత్యేక అధికారులను నియమి స్తూ పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్య దర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 28తో కరీంనగర్ కార్పొరేషన్ పాలక వర్గం గడువు ముగియనుంది.

మిగతా 2 లో



## సీఎం రైతులకిచ్చిన రుణమాఫీ చెక్కు పాస్ కాలేదు

- ప్రజలు మళ్లీ కేసీఆర్‌నే కోరుకుంటున్నారు
- గజ్వేల్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు

.. వివరాలు 3లో




03

## ఇందిరా గాంధీపై అవహేళనగా మాట్లాడితే ఊరుకోం : పొన్నం

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
27 జనవరి
2025





## సంపద, సామరస్యం వైపు
# తెలంగాణ పయనం

మొదటి పేజీ తరువాయి



సహకారాన్ని, జవాబు దారీతనాన్ని సూచిస్తాయి. సమ్మిళిత పాలన, కొత్త విధానాలు, ప్రజాస్వామ్యం పట్ల అచంచల మైన అంకితభావంతో ప్రభుత్వం ఏడాది కాలా న్ని పూర్తి చేసుకుం ది. సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ కోసం పాలన సాగుతోంది. సంపద, సామరస్యం వైపు తెలంగాణ పయనిస్తోంది" అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సికింద్రా బాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరి గిన గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో ప్రసం గించారు. గవర్నర్‌కు ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జిష్ణుదేవ్ వర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిం చారు. సైనిక, వైమానిక దళాలు, రాష్ట్ర పోలీసులు, కొత్తగా ఏర్పడిన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, ఎన్‌సీసీ క్యాడెట్లు, గురుకుల విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. విశేష సేవలందించిన ఉన్నతాధికారులకు పురస్కారా లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, ప్రభుత్వ సలహాదారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు. గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ప్రసం గిస్తూ.. ఈ ఏడాది ప్రభుత్వం ఆవిష్కరించిన తెలంగాణ తల్లి విగ్రహం, తెలంగాణ గేయం సాంస్కృతిక వైభవాన్ని చాటాయని అన్నారు. తెలంగాణ కళలు, సంస్కృతి, సాహిత్యం, జర్నలిజం రంగాల్లో అపారమైన సేవలందించిన ప్రముఖులను సత్కరించాలని సర్కారు నిర్ణయించిందని చెప్పారు.

### అన్నదాతకు అండగా..

"ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం 27 రోజుల్లోనే రాష్ట్రంలోని రైతులకు రూ.2 లక్షల లోపు రుణాలను మాఫీ చేసింది. రైతు భరోసా పథకం కింద ఎకరాకు అందించే పెట్టుబడి సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచింది. భూమిలేని వ్యవసాయ కూలీలను ఉ ద్ధరించాలనే లక్ష్యంతో.. ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమి లేని ప్రతి రైతు కూలీ కుటుంబానికి ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తుంది. సన్నరకం వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ పేరిట రూ.1,206. 44 కోట్లను మంజూరు చేసింది. కృష్ణా వాటర్ ట్రైబ్యునల్-2 ఇటీవల ఇచ్చిన తీర్పు ఫలితం గా.. కృష్ణా జలాల్లో తెలంగాణ తగిన వాటాను పొందడానికి ఆస్కారమేర్ప డింది. ఇందుకు ప్రభుత్వ నిరంతర ప్రయత్నాలు దోహదపడ్డాయి.

### మహిళా సాధికారత దిశగా..

మహాలక్ష్మి పథకం కింద మహిళలు ఆర్టీసీ బస్సు ల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. గృహజ్యోతి పథకం కింద ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందిస్తోంది. పేద కుటుం బాలకు రూ.500కే ఎల్‌పీజీ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తోంది. కోటి మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా, లక్షాధికారులుగా తీర్చి దిద్దే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించింది. మహిళా సాధికారత దిశగా అడుగులేస్తోంది.

### ఆరోగ్య రక్ష

ఆరోగ్యశ్రీ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వైద్య చికిత్సల కవరేజీని రూ.10 లక్షలకు పెంచింది. ఆరోగ్యశ్రీ పరిధిలో మరో 163 కొత్త చికిత్సలను చేర్చింది. ఈ ఏడాది కొత్తగా 8 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రారంభించేందుకు అనుమతులు మంజూరు చేసింది. వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, సమాజం లోని ఇతర బలహీన వర్గాలకు వివిధ సామా జిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశా లను కల్పించే ప్రణాళికలో భాగంగా.. ప్రభు త్వం రాష్ట్ర వ్యాప్తంగా కుల గణన సర్వే చేపట్టిం ది. ఇది తెలంగాణ ప్రజల విభిన్న అవసరాలను తీర్చాలన్న మా నిబద్ధతను చాటుతుంది. మెట్రో రైలు విస్తరణ, మూసీ పునరుజ్జీవం, ఫ్యూ చర్ సిటీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులను చేపడు తోంది. తెలంగాణలో రూ.1,78,950 కోట్ల పెట్టుబడులకు దావోస్‌లో ఒప్పందాలు కుదిరా యి" అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వివరించారు.

# ఇక అధికారుల పాలన

(మొదటిపేజీ తరువాయి)

దీనికి కూడా ప్రత్యేక అధికారిని నియమిస్తూ ఆయన ఉత్తర్వులిచ్చారు. పంచాయతీలు, జిల్లా పరిషత్‌ల పదవీకాలం ఇప్పటికే పూర్తయిన సం గతి తెలిసిందే. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) 2021 ఫిబ్రవరిలో పాలకవర్గం కొలువుతీరింది. జీహెచ్ఎంసీతో పాటు ఖమ్మం, వరంగల్ కార్పొరేషన్లు, ఇంకొన్ని మున్సిపాలిటీలకు కూడా పదవీకాలం మరో ఏడాదిపైనే ఉంది. బాహ్యవలయ రహదారి వరకూ హైదరాబాద్ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని పట్టుదలతో ఉన్న సర్కారు.. శివార్లలో ఉన్న 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరే షన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే వీటి పరిధిలోని 51 పంచాయతీలను ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం చేసింది. జీహెచ్ఎంసీ లో విలీనం చేయబోయే సంస్థలను పక్కనపెట్టి.. పదవీకాలం పూర్తయిన వాటికి ఎన్నికలు నిర్వ హించాలని ప్రభుత్వం భావిస్తోంది.

# ఆ రైతులవి ఆత్మహత్యలే!

- ఎట్టకేలకు గుర్తించిన రెవెన్యూ శాఖ
- 2014-22 మధ్య బలవన్మరణానికి పాల్పడిన 141 మంది అన్నదాతల కుటుంబాలకు ఊరట
- హైకోర్టు ఆదేశాలతో రూ.9.98 కోట్ల పరిహారం విడుదల

**హైదరాబాద్:** సేద్యంలో నష్టాలతో ఆర్థికంగా చితికిపోయి.. చేసిన అప్పులను తీర్చే మార్గం కని పించక.. నిండు ప్రాణాలు తీసుకున్నారు ఆ రైతులు. కానీ, వారి ఆత్మహత్యలను ప్రభుత్వం 'రైతు ఆత్మహత్య' కింద పరిగణనలోకి తీసుకోలేదు. ప్రభుత్వ పరిహారం కోసం వివిధ స్థాయిల్లో రైతుల కుటుంబాలు ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా తిరస్కరణలే ఎదురయ్యాయి. తమకు న్యాయం చేయాలం టూ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశించినా అధికారులు కనికరించలేదు. దీంతో కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. వీలైనంత త్వరగా పరిహారం అందించాలంటూ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేస్తే గానీ పరిహారం విడుదలకు సర్కారు దిగిరాలేదు. 2014 నుంచి 2022 మధ్య ఆత్మహత్య చేసుకున్న 141 మంది రైతుల కుటుంబాలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ తాజాగా రూ.9.98 కోట్లను విడుదల చేసింది. సాగులో నష్టాలతో రైతులు ఆత్మహత్య చేసుకుంటే.. వారి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ.6 లక్షల పరిహారం మంజూరు చేస్తుంది. మండల స్థాయిలో రెవెన్యూ, వైద్య, పోలీసు శాఖల అధికారుల త్రిసభ్య కమిటీ విచారణ జరిపి.. వ్యవసాయ కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించాల్సి ఉంటుంది. విచారణలో పలు కేసులు వాస్తవమేనని గుర్తించారు. కొన్ని కేసుల్లో కమిటీలోని పోలీసు శాఖకు చెందిన సభ్యుడు రైతు ఆత్మహత్య అని ధ్రువీకరించారు. ప్రభుత్వం మాత్రం రైతు ఆత్మహత్యగా నిర్ధారించలేదు. ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారంతో పిల్లలను చదివించుకోవాలని, ఇంటిని నడిపించాలని భావిం చాయి. పరిహారం ఇప్పించాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ బాధిత కుటుంబ సభ్యు లు తిరిగారు. ఎవరూ స్పందించకపోవడంతో ఓ దశలో ఆశలు వదులుకున్నారు. అయితే, 2022 లో రైతులంతా కలిసి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. కేసును విచా రించిన న్యాయస్థానం.. రైతు కుటుంబాలకు ఏడాదిలోపు పరిహారం చెల్లింపులు పూర్తి చేయాలని 2023లో ఆదేశించింది. దీంతో రెవెన్యూశాఖ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. అయితే, కొన్ని జిల్లాల్లో నివేదికల తయారీలో జాప్యం చోటుచేసుకుంది. కోర్టు ఉత్తర్వులను అమలు చేయడం లేదంటూ రైతు కుటుంబాలు 2024 నవంబరులో ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశాయి. త్వరగా పరిహారం పంపిణీ చేయాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ క్రమంలో 141 మందివి రైతు ఆత్మహత్యలుగా రెవెన్యూశాఖ గుర్తించింది. తాజాగా పరిహారం విడుదల ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# రాష్ట్రాల వర్సిటీలపై కేంద్రం ఆధిపత్యమా

- యూజీసీ ప్రతిపాదనలు రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధం
- ఉపసంహరించుకోవాలని ప్రధానిని కోరుతున్నాం
- డాక్టర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, ఉన్నత విద్యామండలి



**హైదరాబాద్ :** "రాష్ట్రాల పరిధిలోని విశ్వవిద్యాలయాల మార్గదర్శకాల్లో మార్పులు చేస్తామంటూ యూజీసీ రాష్ట్రాల కు ప్రతిపాదనలు పంపింది. వీటి ప్రకారం వీసీలను నియమించే అధికారాలు కేంద్ర ప్రభుత్వానికి దఖలు పడు తాయి. ఇది రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధం. యూజీసీ నిబం ధనల ముసుగులో వర్సిటీలపై ఆధిపత్యం కోసం కేంద్రం ఇదంతా చేస్తోంది. ఈ ప్రతిపాదనలను ఉపసంహరిం చుకోవాలని ప్రధాని మోదీని కోరుతున్నాం" అని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ.. "విశ్వవిద్యాలయా లపై కేంద్రం ఆధిపత్యాన్ని నిరూపించుకోవడం వెనుక బలమైన కుట్ర ఉంది. ఇది మనపై జరుగుతున్న సాంస్కృతిక దాడి. రాజ్యాంగాన్ని రచించినప్పుడే డాక్టర్ అంబేడ్కర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అంశాలను స్పష్టంగా విభజించారు. ప్రస్తుత పరిణామాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. విశ్వవిద్యాలయాలంటే సమాజంలో సమస్యలను పరిష్క రించే వేదికలు.. మాజీ ప్రధాని పీవీ, కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డి వంటి ఉత్తమ పార్లమెంటేరియన్లు విశ్వవిద్యాల యాలనుంచే వచ్చారు. యూజీసీ ప్రతిపాదనలతో వీసీలను కేంద్రమే నియమించనుంది. దిల్లీలో ఉన్నవారికి తెలం గాణ ప్రజల బాగోగులు, సంస్కృతి ఏంతెలుస్తాయి? వర్సిటీల్లో రాష్ట్ర ప్రభుత్వాల పాత్రను ఈ ప్రతిపాదనలు నామమాత్రం చేసేలాఉన్నాయి. వీటివల్ల ఏర్పడే అనర్థాల పై కేరళ, తమిళనాడు, కర్ణాటక ముఖ్యమంత్రులతో చర్చించాం. ఏపీ సీఎం చంద్రబాబుతోనూ మాట్లాడను న్నాం. యూజీసీయే నియామకాలు చేస్తుంటే చేతులుకట్టు కుని కూర్చోం. మా హక్కులను, సిద్ధాంతాలను వదులు కోం. వర్సిటీలపై కేంద్రం దండయాత్రలు చేస్తే కొట్లాడతాం. కేంద్రం చేతుల్లోకి వర్సిటీలు వెళితే.. అవి కొందరి విషప్రచార వేదికలుగా మారుతాయి. కేంద్రం ఇలా అన్ని అధికారాలను గుంజుకుంటే.. రాష్ట్ర ప్రభుత్వా లు ప్రజలకు సేవలందించి పన్నులు వసూలు చేసుకునే స్థానికసంస్థల్లా మారే అవకాశాలున్నాయి. మేధావులు, విద్యార్థులు కేంద్రం తీరును నిరసించాలి. సదస్సులు నిర్వ హించాలి. డాక్టర్ అంబేడ్కర్ చెప్పినట్టు విశ్వవిద్యాలయా లంటే చైతన్యాన్ని నింపే వేదికలని నిరూపించనున్నాం. వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న ఓయూలో తొలిసారిగా ఒక దళిత సామాజికవ ర్గానికి చెందిన ఆచార్యుడిని వీసీగా నియమించాం. 20ఏళ్లుగా రాష్ట్రంలో వర్సిటీలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఉత్తమ జాతిరత్నాలను, పార్లమెంటేరియ న్లను అందించిన విశ్వవిద్యాలయాల ప్రతిష్ఠ దిగజారిపో తోంటే చూస్తూ ఊరుకోం. విశ్వవిద్యాలయాలు వేదికగా, విద్యార్థులే కథానాయకులుగా ముందుకు నడిస్తేనే తెలం గాణ సాకారమైంది. వర్సిటీల్లో ఆచార్యుల పదవీ విరమణ వయసును 60 నుంచి 65 ఏళ్లకు పెంచాలనుకుం టున్నాం. ఖాళీ పోస్టుల భర్తీకి వేగంగా నిర్ణయాలు తీసుకో వాలని అధికారులను ఆదేశించాం. రాజకీయ నాయకులు వ్యాపారాల నుంచి కాదు.. విశ్వవిద్యాలయాల నుంచి రావాలి. వర్సిటీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తింపజేస్తాం. అదనంగా నిధులిస్తాం.

### పద్మ పురస్కారాల్లో వివక్ష

కేంద్రం ప్రకటించిన పద్మ పురస్కారాల్లో తెలంగాణపై వివ క్ష స్పష్టంగా కనిపించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, జయధీర్ తిరుమల రావు, గోరటి వెంకన్నల్లో ఒక్కరికీ అవార్డు ప్రకటించక పోవడం నిరాశ కలిగించింది. ఏపీకి ఐదు అవార్డులి చ్చారు.. తెలంగాణకు నాలుగైనా ఇస్తారని ఆశించాం. దీనిపై ప్రధానికి లేఖ రాయనున్నాం. మందకృష్ణ మాదిగకు పద్మ పురస్కారం లభించినందుకు సంతోషంగా ఉ ంది" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతికుమారి, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా, అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ ఎల్వీకే రెడ్డి, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ వి.బాలకిష్టారెడ్డి, ప్రొఫెసర్ రాంరెడ్డి సతీమణి ప్రమీలా రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జనం వద్దకే వస్తున్నాం.. జవాబుదారీగా ఉంటాం

(మొదటిపేజీ తరువాయి)

మంది నిరుపేదలకు లబ్ధి చేకూరుతుంది. రైతు భరోసా సాయాన్ని రూ.10వేల నుంచి రూ.12వేలకు పెంచాం.. సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ చేస్తాం.

### పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వాలన్న జ్ఞానం కేసీఆర్, కేటీఆర్‌లకు లేకపోయింది

రేషన్ కార్డు పేదవారికి ఎంతో కీలకం. పదేళ్ల భారాస పాలనలో కొత్తరేషన్ కార్డులు ఇవ్వలేదు. 80వేల పుస్త కాలు చదివిన మేధావి కేసీఆర్‌కు, అమెరికాలో చదివిన కేటీఆర్‌కు పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వాలన్న జ్ఞానం లేకపోయింది. రాష్ట్రంలో 40 లక్షల కుటుం బాలకు రేష న్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించాం. వారికి సన్నబియ్యం కూడా పంపిణీ చేస్తాం. దేశంలోనే ఏ రాష్ట్రం చేయని విధంగా మొదటి ఏడాదిలో 55,145 ప్రభుత్వ ఉద్యోగా లు ఇచ్చాం. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తుతో పాటు 50 లక్షల పేదల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తున్నాం. 50 లక్షల కుటుంబాలకు రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. 13 నెలల్లో 120 కోట్ల మంది ఆడబిడ్డలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయా ణం చేశారు. ఆర్టీసీకి రూ.4వేల కోట్లు చెల్లించాం.


### కేటీఆర్ కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు

కొడంగల్ అభివృద్ధిని మాజీ సీఎం కేసీఆర్, ఆయన మనుషులు అడ్డుకుంటున్నారు. పదేళ్లలో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తికాలేదు. కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకం పనులు మొదలేపెట్టలేదు. కృష్ణా జలాలను కొడంగల్ ప్రాంతానికి తీసుకురావడానికి ప్రయత్నిస్తుంటే కాళ్లలో కట్టె పెడుతున్నారు. కొడంగల్ నియోజకవర్గంలో పరిశ్రమ లను ఏర్పాటు చేసేందుకు భూసేకరణ చేపడితే అధికా రులపై దాడులు చేయించారు. ఈ ప్రాంతం ఎప్పటికీ వెనకబడే ఉండాలా? యువత ఉ పాధి లేకుండా తిరగాలా? 13 నెలల్లో ఒక్కరోజు కూడా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి రాలేదు. బాధ్యత లేదా? భారాస పాలనలో మీ(కేసీఆర్) ఇంట్లో కుమారుడికి, అల్లుడికి మంత్రి పదవి, ఓడిపోయిన బిడ్డకు ఎమ్మెల్సీ పదవి, తోడల్లుడి కుమారుడికి ఎంపీ పదవి ఇచ్చారు. నేను మా కుటుంబంలో ఎవరికీ పదవులు ఇవ్వలేదు. అయినా మా కుటుంబ సభ్యులు ప్రజలకు సేవ చేస్తుంటే కేటీఆర్ కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు. 31 వరకు అందుతాయి. రూ.22,500 కోట్లతో 4 లక్షల ఇళ్లు కట్టిస్తాం. కొడంగల్ నియోజకవర్గం నుంచి నాలుగు పథకాలను ప్రజలకు అంకితం చేస్తున్నా. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు దావోస్ నుంచి రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకొచ్చాం' అని సీఎం రేవంత్ తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాల కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, నాలుగు గొప్ప పథకాలను ప్రారంభించిందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 21 నుంచి 24 వరకు 12,800 గ్రామసభలు, 3,485 వార్డు సభలను నిర్వహించి అర్హులను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో నారాయణపేట, పరిగి ఎమ్మెల్యేలు డా.పర్నికారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ బేన్ షాలన్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు విజయ్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ విలువలపై విశ్వాసమే గణతంత్రదినోత్సవం

మొదటి పేజీ తరువాయి

పునాది వేసిన స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలకు నివాళులర్పిస్తున్నా. ఈ 76వ గణతంత్ర దినోత్సవం నాడు అభివృద్ధి చెందిన దేశంగా భారత్ను నిర్మించడంలో ప్రధాని మోదీకి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేద్దామని అన్నారు కాగా దేశ ప్రజలు 76వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ధరించిన తలపాగా అందరి దృష్టిని ఆకర్షిం చింది. ఎరుపు, పసుపు కలగలిసిన వర్ణంతో ప్రత్యేకంగా ఉంది. రాజస్థాన్ సంస్కృతికి ప్రతీకగా ఆయన 'సఫా'ను ధరించారు. ఏటా స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకలకు ప్రధాని మోదీ విభిన్నమైన తలపాగాలు ధరించి హాజరవుతారు. దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతిని ప్రతిబింబించేలా ఆయన జాగ్రత్త తీసుకొంటారు. 2024 గణతంత్ర వేడుకల్లో కుంకుమ, గులాబీ, తెలుపు, పసుపుఈసారి ప్రత్యేకత. వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధనడ్, కేంద్ర మంత్రులు తదితరులు పాల్గొన్నారు. 'స్వర్ణిమ్ భారత్, విరాసత్ ఔర్ వికాస్' అనే ఇతివృత్తంతో ఈసారి కవాతులో పాల్గొనే శకటాలకు రూపకల్పన చేశారు. బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులు, పినాక మల్టీబ్యారెల్ రాకెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కర్తవ్య పథ్పై హెలికాప్టర్లు పూల వర్షం కురిపించాయి. రాష్ట్రపతి భవన్ నుంచి ఎర్రకోట వరకు 9 కిలోమీటర్ల మేర రిపబ్లిక్ డే పరేడ్ ఏర్పాటు చేశారు. రాష్ట్రాలు, యూటీలు, కేంద్ర శాఖలకు చెందిన 31 శకటాలను ప్రదర్శిస్తున్నారు. దేశవ్యాప్తంగా గణతంత్ర వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. 'స్వర్ణామ్ భారత్, విరాసత్ ఔర్ వికాస్' అనే థీమ్ శకటాలను రూపొందించారు. బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులు, పినాక మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మిలిటరీ కవాతులో త్రివిధ దళాలు తమ సత్తా చాటాయి. కర్తవ్యపథ్ లో 9 కి.మీ మేర ఈ కవాతు కొనసాగుతోంది. గణతంత్ర వేడుకల్లో భాగంగా మాజి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకకు ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన రాష్ట్రపతితో కలిసి ప్రత్యేక గుర్రపు బండిలో వేదిక వద్దకు చేరుకున్నారు. అనంతరం సైనిక దళాల నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఈ వేడుకల్లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధనడ్, ప్రధాని మోదీ, పలువురు కేంద్రమంత్రులు పాల్గొన్నారు. 300 మంది కళాకారుల బృందం వివిధ రకాల దేశీయ వాయిద్యాలతో 'సారే జహాసే అచ్ఛా' గీతాన్ని వాయించారు. అనంతరం



గగనతలం నుంచి హెలికాప్టర్లు పూల వర్షం కురిపించాయి. గ్రూప్ కెప్టన్ అలోక్ అహ్లావత్ దీనికి నాయకత్వం వహించారు. ఇండోనేసియాకు చెందిన నేషనల్ ఆర్మ్డ్ ఫోర్సెస్ నుంచి 152 మంది బృందం కవాతులో పాల్గొంది. మరో 190 మంది సభ్యుల బ్యాండ్ బృందం మార్చ్ నిర్వహించింది. లెఫ్టినెంట్ అహాన్ కుమార్ నేతృత్వంలోని 61 మంది అశ్విక దళం కవాతు నిర్వహించింది. అనంతరం ట్యాంక్ -90ఃఓఖ-2 శరత్తో పాటు నాగ్, బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థలు, పినాక, అగ్నిబాణ్ మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్లు, ఆకాశ్ వెపన్ సిస్టమ్, చేతక్, బజరంగ్, ఐరావత్ సహా పలు ఆయుధాలను ప్రదర్శించారు. ఈ వేడుకల్లో త్రివిధ దళాలు సంయుక్తంగా ప్రదర్శించిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'సశక్తి ఔర్ సురక్షిత్ భారత్' అనే థీమ్తో దీన్ని తయారు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఐదు వేల మంది కళాకారులు 'జయతి జయ మహాభారతం' పాటకు 11 నిమిషాల పాటు సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు.మోటారు సైకిళ్లపై డేర్‌డెవిల్స్ చేసిన విన్యాసాలు అందరినీ అబ్బురపరిచాయి. బుల్లెట్ సెల్యూట్, ట్యాంక్ టాప్, డబుల్ జిమ్మీ, డెవిల్స్ డౌన్" వంటి అంశాలను ప్రదర్శించారు. 22 ఫైటర్ జెట్లు , 11 ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్టు, ఏడు హెలికాప్టర్లు వైమానిక ప్రదర్శన వీక్షకులను కట్టిపడేసింది. వీటిలో , -30, 5, 3-130,2-295, 2-17, డోర్నియర్-228, ఏఎన్-31 విమానాలతో పాటు ఎమ్ఐ-17 హెలికాప్టర్లు ఉన్నాయి.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
27 జనవరి
2025


# ఎస్.వీ.ఎన్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు

## అంబరాన్నంటిన సంబరాలు

### ఆకట్టుకున్న దేశ నాయకుల వేషధారణలు

### సాంస్కృతిక కార్యక్రమాలతో స్టూడెంట్స్ హల్చల్....!!

### అన్ని రంగాల్లో రాణిస్తున్న ఎస్.వీఎన్ విద్యార్థులు

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట పట్టణంలోని ఎస్.వీ.ఎన్ డిజిటల్ స్కూల్ లో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం కన్నుల పండువుగా నిర్వహించారు. ఎస్.వీ.ఎన్ ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించి విద్యార్థులకు డైరెక్టర్ హిమాన్షుతో కలిసి ఆయన విద్యార్థులకు శుభాభినందనలు తెలిపారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీ స్కూల్ విద్యార్థులు దేశ నాయకులు వేషధారణలో ఎంతగానో అలరించారు. యూకేజీ విద్యార్థి బృందణ్ జాతిపిత మహాత్మా గాంధీ వేషధారణలో తన హావభావాలతో అలరించిన తీరు పాఠశాల విద్యార్థులను ఆనందింపజేసింది. గంటల తరబడి కదలకుండా నిలబడి ఉంటూ చేసిన సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అదేవిధంగా ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలో సహస్ర అనే విద్యార్థిని కూడా అందరినీ ఆకట్టుకున్నది. సీ.హెచ్ భవిష్య కూడా వేషధారణలో ఔరా అనిపించుకున్నది. సాక్షాత్తు నాటి స్వాతంత్ర పోరాట వీరులు మరొమారుగా ఈ పుడమిపైకి వచ్చారా... అన్న అనుభూతిని కల్పించారు. స్టూడెంట్స్ చేసిన సందడితో ఎస్.వీ.ఎన్ ఆవరణ కోలాహలంతో నిండిపోయింది. దేశభక్తి గేయాలను ఆలపించిన స్టూడెంట్స్కు అపూర్వ ఆదరణ లభించింది విద్యార్థుల కోలాహలం హల్చల్ మధ్య అద్భుతంగా కార్యక్రమం కొనసాగింది.










## ప్రపంచానికి దిక్సూచిగా ఇండియా నిలబడుతోంది: ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్

ప్రపంచానికి దిక్సూచిగా ఇండియా నిలబడుతున్నదని ఎస్.వీ.ఎన్ డిజిటల్ హైస్కూల్ వ్యవస్థాపకులు గొట్టిపర్తి భాస్కర్ అన్నారు. ఆయన 76వ రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఒకవైపు ఇస్రో ఎవరూ చేయలేని విధంగా సాటిలైట్లను అంతరిక్షంలోకి పంపుతూ అగ్రగామి దేశాలతో సమానంగా ముందుకు సాగుతున్నదని చెప్పారు. అదేవిధంగా ఆధ్యాత్మిక రంగంలో కూడా రాణిస్తూ భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధిస్తున్నదని చెప్పారు. సర్వ మతాలను ఆదరిస్తూ అభివృద్ధి చెందుతున్నది అన్నారు. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఎకానమీ కలిగిన దేశంగా నిలబడిందని చెప్పారు. న్యాయ, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో వినూత్నమైన మార్పులు వస్తున్నప్పటికీ ఇండియా ప్రగతి పథంలో ముందుకు సాగుతున్నదని చెప్పారు. స్వతంత్రం వచ్చిన తర్వాత భారత రాజ్యాంగ రచన కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ ఆధ్వర్యంలోని రాజ్యాంగ కమిటీ మూడు సంవత్సరాల పాటు కష్టపడి భారత రాజ్యాంగాన్ని రచించిందని వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖితపూర్వక రాజ్యాంగంగా భారత రాజ్యాంగానికి పేరు ఉన్నదని చెప్పారు. భారత రాజ్యాంగం ద్వారానే అందరికీ సమానమైన ఓటు హక్కు లభిస్తున్నదని చెప్పారు. కులమత వర్గ, జాతి, లింగ భేదాలు లేకుండా ప్రజలు అన్ని హక్కులు అనుభవిస్తున్నారని అన్నారు. సౌభ్రాతృత్వం... వ్యక్తుల పట్ల గౌరవం... దేశ సమైక్యత భారతీయులకే దక్కిందని చెప్పారు.





















ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
27 జనవరి
2025




# అన్ని రంగాల్లో రాణిస్తున్న ఎస్.వీ.ఎన్ విద్యార్థులు

పట్టణంలోని ఎస్.వీ.ఎన్ డిజిటల్ హైస్కూల్ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. ఈ స్కూల్లో విద్యార్జన చేసిన వారు ఆ తర్వాత చక్కగా స్థిరపడుతున్నారని చెప్పారు. అన్ని అంశాలలోనూ విద్యార్థులకు సంబంధించి బోధన చేస్తూ ఆల్ రౌండ్ డెవలప్మెంట్ గా ముందుకు సాగుతున్నారని చెప్పారు. వినూత్న విద్యా విధానం... విలక్షణ ప్రణాళికలతో ముందుకు సాగుతూ విద్యార్థి లోకంలో ధృవతారగా నిలబడిందని చెప్పారు. విద్యార్థులకు దేశభక్తినీ పెంపొందింప చేయడం కోసం పాఠశాల స్థాపించిన 29 సంవత్సరాలలో అనేక కార్యక్రమాలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా విద్యార్థులకు ఉదహరించారు. ఈ దేశానికి అవసరమైన ఒక సివిల్ సర్వెంట్ ఇవ్వడంతో పాటు ఎంతోమంది డాక్టర్లను, ఇంజనీర్లను అన్నింటికీ మించి అద్భుతమైనటువంటి మానవత్వాన్ని రంగరించుకున్న ఎంతోమంది ఉత్తమ పౌరులను తయారు చేసిందని చెప్పారు. సామాజిక ఆర్థిక రంగాలలో నిలబడ్డారని ఎన్నో ఉద్యోగాలు సాధించి ఈరోజు సమాజానికి సేవ చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎస్ వి అండ్ డైరెక్టర్ గొట్టిపర్తి హిమాన్షు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.













## లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ లో ఘనంగా 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

దిల్సుఖ్నగర్, రోమింగ్ న్యూస్: స్థానిక దిల్సుఖ్నగర్ లోని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ లో గణతంత్ర దినోత్సవాన్ని ఎంతో ఘనంగా జరిపారు. పాఠశాల లేడీ డైరెక్టర్ కోమటిరెడ్డి మంజుల రాణి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. వేడుకలు పూజా కార్యక్రమంతో ఆరంభమయ్యాయి. తర్వాత ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించి విద్యార్థులను ఉద్దేశించి విలువైన సందేశాన్ని అందించారు. "మన దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉంటుంది. విద్యార్థులలో సత్ప్రవర్తన, నైతిక విలువలు పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే," అని ఆమె అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చుకోవాలని, వారి విజయం సమాజ అభివృద్ధికి దోహదపడాలని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. భారత రాజ్యాంగం గురించి విద్యార్థుల ప్రసంగాలు, దేశభక్తి గీతాలు, నృత్యాలు ప్రేక్షకులను ఉత్సాహభరితులను చేశాయి. ముఖ్యంగా విద్యార్థుల పిరమిడ్ విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి మాధవి గారు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ వేడుక దేశభక్తిని జాగృతం చేయడమే కాకుండా, మన దేశ అభివృద్ధికి విద్యార్థుల పాత్రను గుర్తు చేయడం లక్ష్యంగా కొనసాగింది.




### భవిష్యత్ భారతాన్ని విద్యార్థులే నిర్మిస్తారు

తన ప్రసంగంలో శ్రీమతి మంజుల రాణి గారు, "మన దేశ ప్రగతి విద్యపై ఆధారపడి ఉంది. విద్యార్థులు నైతిక విలువలతో ఎదగడం, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడం ఎంతో ముఖ్యమని" చెప్పారు. విద్యార్థులను సృజనాత్మకత, సమాజ సేవతో కూడిన వ్యక్తులుగా తయారు చేయడంలో పాఠశాలలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

ఈ వేడుకలో దేశభక్తి, నైతిక విలువల ప్రాధాన్యతను తెలియజేయడం ద్వారా విద్యార్థులు స్ఫూర్తిని పొందారు. లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరిపి అందరి మనసులను గెలుచుకుంది.



## ఒక్‌వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్లో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

హైదరాబాద్, రోమింగ్ న్యూస్: ఒక్‌వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్లో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశభక్తి మరియు జాతీయ గర్వాన్ని ప్రతిబింబిస్తూ ఘనంగా నిర్వహించబడ్డాయి. కార్యక్రమం జాతీయ పతాక ఆవిష్కరణతో ప్రారంభమైంది. నేషనల్ అడ్వైజర్ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ మరియు ట్రస్మా రాష్ట్ర సలహాదారు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పతాకావిష్కరణ అనంతరం గానం చేసిన జాతీయ గీతం స్కూల్ ఆవరణ అంతటా నినదించి అందరికీ ఐకమత్యం మరియు దేశభక్తి భావనను పంచింది. ఈ వేడుక విద్యార్థుల సృజనాత్మకతను, శ్రమను, దేశానికి ప్రేమను ప్రతిబింబించే విధంగా అత్యంత క్రమశిక్షణతో సాగిన మార్చ్‌పాస్ట్‌తో ప్రారంభమైంది. దాని తర్వాత విద్యార్థుల వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భారతదేశంలోని ఐక్యతలో విభిన్నతను ఆకట్టుకునే రీతిలో ప్రదర్శించాయి. సంప్రదాయ నృత్యాల నుంచి ఆధునిక ఆవిష్కరణల వరకు, ఈ ప్రదర్శనలు భారతీయ సంప్రదాయ మరియు సంస్కృతుల సొబగులను ప్రతిబింబించాయి. అన్వయంతో రూపొందించిన ఒక స్కిట్ గణతంత్ర దినోత్సవ పరిమళాన్ని అందరికీ తెలియజేసింది, రాజ్యాంగ విలువల ప్రాముఖ్యత మరియు అవి నేటి ప్రపంచానికి ఎంత ముఖ్యమో శక్తివంతమైన సందేశాన్ని అందించింది. డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి తన స్ఫూర్తిదాయక ప్రసంగంలో భారత యువత యొక్క అపార శక్తిని మరియు వారి భవిష్యత్తు ఆవిష్కరణలో పాత్రను ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల్ని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రాయోగిక జ్ఞానంపై ఆధారపడిన నైపుణ్యాల ఆధారిత విద్య అవసరమని ఆయన వివరించారు. పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించి, సహజ వనరులను రక్షించడం, పరిశుభ్రతను ప్రోత్సహించడం, మరియు "స్వచ్ఛ భారతం, హరిత భారతం" కోసం చురుకుగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు మరియు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ రాబోయే తరాలకు స్థిరమైన భవిష్యత్తును అందించడానికి ఎంతో అవసరమని ఆయన అన్నారు.

వైస్ చైర్మన్ ప్రసంగం ప్రేక్షకుల హృదయాలను స్పృశించి, వ్యక్తిగత అభివృద్ధితో పాటు జాతీయ పురోగతి మరియు పర్యావరణ పరిరక్షణ బాధ్యతను తీసుకోవడానికి అందరికీ ప్రేరణనిచ్చింది

ఈ వేడుకలో పాఠశాల ప్రిన్సిపాల్ మిస్టర్ శర్మ, డైరెక్టర్ మిసెస్ శారద, ఇన్‌ఛార్జ్ టీచర్లు, తల్లిదండ్రులు, మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారి చురుకైన పాత్ర ఈ కార్యక్రమానికి మరింత జోషాన్ని తీసుకొచ్చింది. కార్యక్రమం జాతీయత భావనతో పాటు సమాజానికి సానుకూలంగా తోడ్పడే నూతన సంకల్పంతో ముగిసింది. ప్రిన్సిపాల్ మరియు డైరెక్టర్, డాక్టర్ గోపాల్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలియజేస్తూ, స్కూల్ నైతిక విలువలతో పాటు అకాడమిక్ ప్రావీణ్యం మరియు ప్రాయోగిక నైపుణ్యాలను సమతుల్యం చేస్తూ విద్యను అందించడంపై నిబద్ధత వ్యక్తం చేశారు.

ఒక్‌వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు దేశభక్తి, ఐకమత్యాన్ని ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమం రాజ్యాంగ ప్రాముఖ్యతను మరియు మంచి, పరిశుభ్ర మరియు హరిత భారతం కోసం ప్రతి వ్యక్తి పాత్రను గుర్తు చేసింది.




## కౌడిపల్లి మండలంలోని బుజరంపేట్ పాఠశాలలో గ్రీన్ కో సంస్థ ఆధ్వర్యంలో వేడుకలు

మెదక్ కౌడిపల్లి, జనవరి 26 (రోమింగ్ న్యూస్): మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని బుజరంపేట్ పాఠశాలలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. గ్రీన్ కొ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ వెంకట సతీష్ మాట్లాడుతూ అందరికీ 76వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ఆకాంక్షిస్తూ స్వేచ్ఛ స్వాతంత్ర్యాల వెనక ఎంతోమంది పోరాట యోధుల త్యాగం దాగి ఉన్నదని గుర్తు చేశారు. మన వంతు బాధ్యతగా దేశ సేవ కొరకు పాటుపడాలని అన్నారు. పాఠశాల విద్యార్థులు అందరూ మంచిగా చదువుకోవాలని అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా బుజరంపేట్ పాఠశాలలో స్కూల్ పిల్లలకు గ్రీన్ కో సంస్థ అసిస్టెంట్ మేనేజర్ వెంకట సతీష్ చేతుల మీదుగా పాఠశాలలోని విద్యార్థులకు రాగిజావ తాగడానికి గ్లాసులు ఇవ్వడం జరిగింది. మరియు పాఠశాలలోని విద్యార్థులకు బ్యాగులు ఇవ్వడం జరిగింది. గ్రీన్ కో సంస్థ వారి స్టాఫ్ గవరాజు, పెంటయ్య, దుర్గేష్, దేవ్ కుమార్, యాదుల్ మరియు సెక్యూరిటీ అందరూ పాల్గొనడం జరిగింది.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
27 జనవరి
2025





# అర్హులకు సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే బీర్ల

## పైలట్ ప్రాజెక్టులో భాగంగా సైదాపురంలో అర్హులకు నాలుగు పథకాల ప్రొసీడింగ్ పత్రాలు అందజేత

**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. రైతుభరోసా, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు సంబంధించిన పైలట్ ప్రాజెక్టులో భాగంగా.. ఆదివారం యాదగిరిగుట్ట మండలం సొంతగ్రామమైన సైదాపురంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డితో కలిసి లబ్ధిదారులకు నాలుగు పథకాల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో మాట్లాడుతూ.. తన సొంత గ్రామం సైదాపురం నుండి నాలుగు పథకాల అమలును ఆరంభించడం సంతోషంగా ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ళ నుండి రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో.. లక్షల దరఖాస్తులు ఆఫీసుల్లో పేరుకుపోయాయన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్ కార్డులు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని రిపబ్లిక్ డే నుండి అమలు షురూ చేశామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి పనికిరాని గుట్టలు, పుట్టలు, రాళ్లు, రప్పలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు రైతుబంధు ఇచ్చి ప్రజాధనాన్ని



దుర్వినియోగం చేసిందని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అలా కాకుండా వ్యవసాయ యోగ్యమైన భూమి ఉన్న రైతుకే అధిక లబ్ధి చేకూరాలని రైతుభరోసా తెచ్చి ఎకరానికి ఏడాదికి రూ.12 వేలు ఇస్తున్నామని తెలిపారు. భూములు లేని నిరుపేదలకు సైతం ఆదుకోవాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని తెచ్చి అర్హులైన పేదలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం ఇవ్వడానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇక ఖాళీ స్థలం ఉండి ఇండ్లు కట్టుకోలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి.. నిర్మాణం కోసం రూ.5 లక్షలు ఇస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని.. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇక పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్న సైదాపురంలో.. 28 మందికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, 918 మంది రైతులకు రైతుభరోసా, 91 మందికి కొత్త రేషన్ కార్డులు, 172 మందికి ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులకు అందజేశామన్నారు. ఇక సర్పంచ్, ఎంపీటీసీగా గెలిపించి.. నేడు ఎమ్మెల్యే అయ్యేలా రాజకీయ భిక్ష పెట్టిన సైదాపురం ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజు గౌడ్, జిల్లా నాయకుడు వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ బీర్ల శంకర్, మాజీ ఉప సర్పంచ్ దుంబాల సురేఖ, తహశీల్దార్ దేశ్యానాయక్, ఎంపీడీవో నవీన్ కుమార్, ఏడీఏ శాంతినిర్మల, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ సుధారాణి, ఎంపీవో సలీం, విలేజ్ సెక్రటరీ రోజా తదితరులు ఉన్నారు.




# గుట్ట గుడికి పీఆర్వోల వల్ల ఖజానాకు గండి

### యాదగిరిగుట్ట బీజేపీ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** పవిత్ర పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ నియమించుకున్న పీఆర్వోల వల్ల ఆలయ ఖజానాకు గండి పడుతోందని యాదగిరిగుట్ట పట్టణ బీజేపీ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ ఆరోపించారు. ఆదివారం యాదగిరిగుట్టలోని బీజేపీ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడారు. అసలు కొండపైన పీఆర్వోలను ఎందుకు పెట్టుకున్నారో స్పష్టత ఇవ్వాలని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ కాంగ్రెస్ పార్టీకి చెందినవారేనని, అలాంటప్పుడు వేర్వేరుగా పీఆర్వోలను ఎందుకు పెట్టుకున్నారో అర్థం కావడం లేదన్నారు. ఎమ్మెల్యే ఆరుగురు పీఆర్వోలు, ఎంపీ ఇద్దరు పీఆర్వోలు, ఎమ్మెల్సీ ఇద్దరు పీఆర్వోలు.. మొత్తం పదిమంది పీఆర్వోలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ దేవస్థానానికి ఆదాయం రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ పంపించారని చెప్తూ ఉచితంగా దర్శనాలు చేపిస్తూ ఆలయానికి వచ్చే ఆదాయాన్ని తమ ఖాతాలో వేసుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో ఏ ప్రభుత్వం పీఆర్వోలను పెట్టుకోలేదన్న ఆయన.. ప్రస్తుతం ఉన్న పీఆర్వోలు దర్శనాల పేరుతో దందాకు తెరలేపి అవినీతి, అక్రమాలకు యాదగిరిగుట్టను అడ్డాగా మార్చారని ధ్వజమెత్తారు. ఎలాంటి జీతభత్యాలు లేకున్నా పీఆర్వోలుగా పనిచేస్తున్నారంటే.. వాళ్ల ఆదాయ మార్గాలు ఏంటో ఇట్టే అర్థమవుతోందన్నారు. సదరు ప్రజాప్రతినిధులు వారి పీఆర్వోలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు స్వర్ణతాపడం కోసం భక్తులు ఇచ్చిన విరాళాలతో బంగారం కొనకపోవడంతో అట్టి విరాళాలతో ప్రస్తుతం తక్కువ బంగారం వస్తోందని.. దీనికి బాధ్యత ఎవరు వహిస్తారో ఆలయ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గత మూడు నెలల నుండి పెండింగ్ లో ఉన్న ఆలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు మల్లేష్, బీజేవైఎం అధ్యక్షుడు బుచ్చిబాబు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నరేష్, సీనియర్ నాయకులు బెలిదే అశోక్, జవహర్, నాయకులు సురేష్, దేవేందర్, శ్రీశైలం, వంశీ, శివ, లక్ష్మణ్, శ్యామ్ తదితరులు ఉన్నారు.

# రాజకీయాల్లో పదవులకే వీడ్కోలు.. ప్రజాసేవకు కాదు

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: రాజకీయాల్లో పదవులకే తప్ప ప్రజాసేవకు వీడ్కోలు ఉండదని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. యాదగిరిగుట్టలో మున్సిపాలిటీ పాలకవర్గం పదవీకాలం ముగిసిన సందర్భంగా ఆదివారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసేవ చేయాలంటే పదవులు అవసరం లేదని, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం, చిత్తశుద్ధి ఉంటే సరిపోతుందన్నారు. కరోనా లాంటి క్లిష్టమైన పరిస్థితులు ఎదురైనప్పటికీ పట్టణ అభివృద్ధి కోసం మున్సిపల్ చైర్మన్ సహా పాలకవర్గం చేసిన కృషిని మెచ్చుకున్నారు. కరోనా సమయంలో సొంత మనుషులు సైతం తమ కుటుంబ సభ్యులను తాకడానికి భయపడిన పరిస్థితుల్లో.. తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి శానిటేషన్ సిబ్బంది చూపిన తెగువ వెలకట్టలేనిదని కొనియాడారు. పదవీకాలం ముగిసిందని కౌన్సిలర్లు నిర్లక్ష్యంగా ఉండొద్దన్న ఆయన.. కొత్త పాలకవర్గం వచ్చే వరకు తామే కౌన్సిలర్లుగా భావించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.







నరసింహస్వామి ఆశీస్సులతో మాజీలైన ప్రస్తుత కౌన్సిలర్లే తల్లీ కౌన్సిలర్లుగా గెలవాలని ఆకాంక్షించారు. అనంతరం చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఐనాల చైతన్యా మహేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సుధా

స్థానిక ప్రజలతో పాటు నారసింహుడి దర్శనం కోసం వచ్చే భక్తులకు సైతం సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమని, అందులో భాగంగానే మున్సిపాలిటీ అభివృద్ధికి ఎక్కువ నిధులు మంజూరు చేపిస్తున్నానని పేర్కొన్నారు.

హేమేందర్ గౌడ్, కమిషనర్ అజయ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాలరాజు గౌడ్, మాజీ ఉప సర్పంచ్ భరత్ గౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

# కొల్చారం మండలంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



మెదక్ కొల్చారం, జనవరి 26( రోమింగ్ న్యూస్): మెదక్ జిల్లా కొల్చారం మండలంలో 76వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొల్చారం మండల కేంద్రం బస్టాండ్ ఆవరణలో జాతీయ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ సందర్భంగా మండల ప్రజలకు అందరికీ 76 గణతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ ఉపాధ్యక్షులు గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గంగసాని మహేశ్వర్ రెడ్డి ట్రెజరర్ మధుసూదన్ రెడ్డి. సీనియర్ నాయకులు దేవ నగర్ శేఖర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మారెల్లి అనిల్ కుమార్ ఇల్లు గారి శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచులు మన్నె శ్రీనివాస్ పాండు మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి మైనార్టీ సెల్ మండల ప్రెసిడెంట్ సయ్యద్ అక్రమ్. కొల్చారం గ్రామ శాఖ నాయకులు చింతల బాలరాజు శ్రీశైలం . చిన్న గణపురం పిఎసిఎస్ చైర్మన్ మంద నాగయ్య. కిష్టాపూర్. చిన్న గన్ పూర్ గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్. అశోక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమేష్ ప్రభాకర్ సత్యం వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జనగామలో కాంగ్రెస్ బిఆర్ఎస్ బాహా బాహీ

### పోలీసుల లాఠీచార్జ్
### ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అరెస్ట్
### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన రద్దు

జనగామ,జనవరి 26: (రోమింగ్ న్యూస్) : స్వాతంత్రం వచ్చిన తర్వాత ఒక చక్కటి రాజ్యాంగాన్ని ఏర్పరచుకొని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేయాల్సిన గణతంత్ర దినోత్సవం నాడు జనగామలో అపశృతులు చోటుచేసుకున్నాయి. కాంగ్రెస్, టిఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాటలు, ఘర్షణలు, కొట్లాటలు, దాడులు, ప్రతి దాడులు చోటు చేసుకోవడంతో ఇక్కడ రాజ్యాంగం అపహాస్యం పాలయింది. కారణాలు ఏమైనాప్పటికీ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత కలిగిన వారంతా కనీసం గణతంత్ర దినోత్సవం ఒక్కరోజైనా రాజ్యాంగబద్ధంగా వ్యవహరించుకుంటే బాగుంటుందన్న కనీస జ్ఞానాన్ని విస్మరించడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. జనగామ నియోజకవర్గం లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలను ప్రారంభించడానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం జనగామ మండలం ఎర్రకుంట తండా లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటనకు ముందే జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్రెడ్డి చేరుకున్నారు. అంతకుముందే టిఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు హౌస్ అరెస్టు చేయడంతో అలా ఎందుకు చేశారు అంటూ ఎమ్మెల్యే పోలీసులతో మాట్లాడుతున్నారు. ఈ క్రమంలో పల్ల గో బ్యాక్ పల్ల గో బ్యాక్ అంటూ కొంతమంది కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేయడం ప్రారంభించారు. ఇదే సమయంలో మరోవైపు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రోటోకాల్ ప్రకారం తగిన గౌరవం లభించడం లేదంటూ టిఆర్ఎస్ శ్రేణులు ఆరోపించడం, కాంగ్రెస్ డౌన్ డౌన్ అంటూ అరవడం... ఇలా ఒక్కసారిగా ఇరు వర్గాల మధ్య ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ చేతులకు కూడా పని చెప్పడంతో దాడులు ప్రతి దాడులు కూడా చోటుచేసుకున్నాయి. కుర్చీలతో చేతులతో దాడులు







చేసుకోవడంతో కొంతమందికి గాయాలు, కొంతమందికి రక్తం కారడం చోటు చేసుకోవడంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. లాటి ఛార్జ్ జరపడంతో కాంగ్రెస్ టిఆర్ఎస్ శ్రేణులు అదుపులోకి వచ్చినప్పటికీ ఉద్రిక్త వాతావరణం ఉండడంతో పోలీసులు ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డిని అక్కడి నుంచి తరలించారు. పోలీసు జులం నశించాలంటూ టిఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేస్తుండగా ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి కివ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేయడం కనిపించింది. వాతావరణం ఉద్రిక్తంగా మారడంతో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటనను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. జనగామ నియోజకవర్గంలో కాంగ్రెస్ గుండాలతో దాడులు చేయిస్తూ గుండాల రాజకీయం చేస్తుందని దీన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదంటూ ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ హెచ్చరించారు. మరోవైపు జనగామలో జరిగిన సంఘటన ను ఖండిస్తూ ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి తో పాటు, అరెస్ట్ చేసిన బిఆర్ఎస్ నాయకులను వెంటనే విడుదల చేయాలంటూ మాజీ మంత్రి హరీష్ రావు ఆదివారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. తాగుబోతులను ఎక్కడినుండో జనగామకు తీసుకువచ్చి టిఆర్ఎస్ నాయకుల పై కాంగ్రెస్ నాయకులు దాడి చేయిస్తున్నారని టిఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తుండగా, రానున్న సర్పంచ్ ఎన్నికలలో ఎలాగైనా గెలవాలని దొంగ ఓట్లతో గెలిచిన ప్రస్తుత ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ నాయకుల పైననే దాడులు చేపిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ గుండాల వల్లనే పలువురికి గాయాలు జరిగాయని ఎమ్మెల్యే పల్ల రాజేశ్వర్ రెడ్డి ఆరోపించగా మరోవైపు ఈ దాడులలో గాయపడ్డ వారిని జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ కొమ్మూరి ప్రతాపరెడ్డి హాస్పిటల్ కి వెళ్లి వారిని పరామర్శిస్తూ ఈ దాడులు టిఆర్ఎస్ నాయకులు చేశారంటూ, ఈ దాడులను ఖండిస్తున్నట్లు ఆయన అన్నారు. ఇలా ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ ఎలాగైనా సరే జనగామ నియోజకవర్గం లో రానున్న సర్పంచ్ ఎన్నికలలో ఎవరికి వారు తమ పార్టీ నాయకులనే గెలిపించుకోవాలని తపన పడుతున్న నేపథ్యంలో ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇరు వర్గాల మధ్య దాడులు చోటు చేసుకోవడం మాత్రం బాధాకరం. గణతంత్ర దినోత్సవం నాడు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రధాన పార్టీలు ప్రవర్తించడం భావ్యంగా లేదంటూ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికలలో గెలవాలన్న తపన తప్పు కాదు అని అయితే, అయితే హుందాగా ప్రవర్తించాలని, ప్రజాస్వామ్యబద్ధంగా రాజ్యాంగానికి లోబడి వ్యవహరించాలన్న ధ్యాస కొంతమంది ముఖ్య నాయకులలో వారి మాటలలో చేతలలో కనిపించకపోవడం బాధాకరం. రానున్న ఎన్నికల కొరకు అలుపు లేకుండా లేకుండా కష్టపడడంలో తప్పులేదు కానీ అది కూడా గణతంత్ర దినోత్సవం రోజున ఈ విధంగా ప్రవర్తించడం మాత్రం క్షమించరాని విషయం. ఇకనైనా రాజకీయాలు మారాలి. నాయకులు మారాలి అంటూ ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
27 జనవరి
2025



# నాలుగు ప్రభుత్వ పథకాలకు శ్రీకారం

- 606 గ్రామాల్లో లబ్ధిదారులకు మంజూరు పత్రాల అందజేత
- ఎర్రకుంట తండాలో భారాస, కాంగ్రెస్ వర్గాల తోపులాట
- మిగతా ప్రాంతాల్లో ప్రశాంతంగా పథకాల పండగ



**హైదరాబాద్:** రాష్ట్రంలో 606 గ్రామాల్లో నాలుగు ప్రతిష్ఠాత్మక సంక్షేమ పథకాలకు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం లాంఛనంగా శ్రీకారం చుట్టింది. ప్రతి మండలంలో ఎంపిక చేసిన ఒక్కో గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల వివరాలను ప్రకటించి మంజూరు పత్రాలను అందజేశారు. నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పాల్గొన్నారు. ఇక్కడి లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను సీఎం అందజేశారు. మిగతాచోట్ల పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఉన్నతాధికారులు పాల్గొని ప్రభుత్వ పథకాలను ప్రారంభించారు. పథకాల ప్రారంభం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందించిన వీడియో సందేశాన్ని గ్రామాల్లో ప్రదర్శించారు. ఎంపిక చేసిన గ్రామాల లబ్ధిదారుల జాబితాను శనివారమే అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. లబ్ధిదారులకు పత్రాలను అందజేయడానికి కావాల్సిన ఏర్పాట్లను గ్రామాల్లో ఆదివారం ఉదయానికే పూర్తయ్యాయి. ఈ సభలకు లబ్ధిదారులతో పాటు స్థానిక ప్రజలు కూడా హాజరయ్యారు. దీంతో అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలను దశల వారీగా అందిస్తామని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు భరోసా ఇచ్చారు. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. జనగామ జిల్లా ఎర్రకుంట తండాలో ఏర్పాటు చేసిన సభలో భారాస, కాంగ్రెస్ వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇక్కడ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

### ఎర్రకుంట తండాలో ఉద్రిక్తత

జనగామ మండలం ఎర్రకుంట తండాలో కాంగ్రెస్, భారాస వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యేందుకు అన్ని ఏర్పాట్లను చేశారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సభ వద్దకు చేరుకుని అనర్హులకు పథకాలను అందిస్తున్నారని, అర్హులకు ఇవ్వాలని అధికారులను అడిగారు. స్థానిక భారాస నేతలను ముందస్తు అరెస్టు ఎందుకు చేశారని పోలీసులను ప్రశ్నించారు. దీంతో కాంగ్రెస్, భారాస కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఒక దశలో ఎమ్మెల్యేపై కోడిగుడ్లు విసరడంతో పరిస్థితి మరింత ఘర్షణకు దారి తీసింది. ఎమ్మెల్యే పల్లాను పోలీసులు సభాప్రాంగణం నుంచి పంపారు. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి పర్యటన రద్దయింది. అధికారులే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

### పలుచోట్ల మంత్రుల హాజరు

ఉమ్మడి ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం చిన్నగోపతిలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. ముదిగొండ మండలం ఖానాపురంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రఘునాథపాలెం మండలం మల్లేపల్లిలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు పాల్గొని లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో హసన్‌పర్తి మండలం పెంబర్తి, ధర్మసాగర్ మండలం క్యాతంపల్లిలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. వర్ధన్నపేట మండలం వెంకట్రావుపల్లిలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ములుగు మండలం జీవంతరావుపల్లిలో రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని తిరుమలగిరి మండలం కేటీ అన్నారంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. వలిగొండ మండలం నాతాలగూడెంలో రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం పసుపులలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ హాజరు కావాల్సి ఉండగా వారు రాకపోవడంతో స్థానిక ఎమ్మెల్యేలు ఈ పథకాలను ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం ఇసోజిపేటలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ లబ్ధిదారులకు పత్రాలను అందించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో స్థానిక ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఇచ్చోడ మండలం నవేగంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ నగేశ్ పాల్గొన్నారు.



# అంబేద్కర్ స్ఫూర్తితోనే మోదీ పాలన

**- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితోనే ప్రధాని మోదీ పాలన అందిస్తున్నారని, నెహ్రూ హయాం నుంచి కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని అవహేళన చేస్తోందని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం మాట్లాడుతూ.. "ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు రాజ్యాంగాన్ని కాలరాసి, అధికార దుర్వినియోగం చేసి ఎమర్జెన్సీ పెట్టారు. 'మీసా' చట్టం కింద దేశాన్ని జైలుగా మార్చి, పౌర హక్కులు, పత్రికాస్వేచ్ఛను హరించారు. ఇవన్నీ రాహుల్ గాంధీకి అర్థం కావు. రాజ్యాంగం పుస్తకాన్ని పట్టుకుని తిరిగే ఆయన కనీసం దాన్ని చదవలేదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసింది" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ బీఆర్ అంబేద్కర్ జీవితానికి సంబంధించిన ఐదు ప్రముఖ స్థలాలను 'అంబేద్కర్ పంచతీర్థాలు'గా అభివృద్ధి చేశారని, ప్రజలంతా వీటిని సందర్శిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్ని గ్రామాల్లో పథకాలు అమలు చేయకపోతే రణరంగమే : కేటీఆర్



**హైదరాబాద్:** కాంగ్రెస్ ఎన్నికల సమయంలో అన్ని గ్రామాల్లో ప్రచారం చేసి గెలిచాక ఇప్పుడు మండలానికో ఊరు చొప్పున పథకాలు అమలు చేయడం ప్రజలను మోసం చేయడమేనని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. వెంటనే అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని లేని పక్షంలో గ్రామాలు రణరంగంగా మారతాయని ఓ ప్రకటనలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. "ఎన్నికల ప్రచారంలో మండలానికి ఒక ఊరిలోనే పథకాలు అమలుచేస్తామని కాంగ్రెస్ చెప్పిందా? గ్యారంటీ కార్డులను కేవలం మండలానికి ఒక ఊరిలోనే పంచిందా? కేవలం మండలానికి ఒక ఊరి ప్రజలే కాంగ్రెస్‌కు ఓటు వేశారా? ఏడాది కాలంగా పథకాలను వాయిదాలు పెట్టి ఇప్పుడు కాంగ్రెస్ ప్రజల్ని మోసం చేస్తోంది. రాష్ట్రంలోని అన్ని గ్రామాల ప్రజలు కాంగ్రెస్ పార్టీ హామీలను మర్చిపోవద్దు. కాంగ్రెస్ ఆనాడు 'అందరికీ అన్నీ' అని చెప్పిన మాట మరిచి నేడు 'కొందరికే కొన్ని' పేరిట మభ్యపెడుతోంది. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ మోసాన్ని క్షమించరు. ప్రతిపక్షంగా ఇంకో నాలుగేళ్లు ఓపిక పట్టడానికి మేము సిద్ధం కానీ, ప్రజలు మాత్రం సిద్ధంగా లేరు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన ప్రతి గ్రామానికి, ప్రజలకు అండగా ఉంటాం. ప్రభుత్వం వెంటనే అన్ని గ్రామాల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.




# ఇందిరా గాంధీపై అవహేళనగా మాట్లాడితే ఊరుకోం : పొన్నం

**హైదరాబాద్:** ఇందిరా గాంధీ గురించి అవహేళనగా మాట్లాడితే ఊరుకునేది లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఆదివారం గాంధీభవన్‌లో మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, పార్టీ నేతలు చరణ్‌కౌశిక్ యాదవ్, రాంమోహన్‌రెడ్డిలతో కలిసి మీడియాతో పొన్నం మాట్లాడారు. "రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు బండి సంజయ్ ఇంట్లో నుంచి డబ్బులు ఇవ్వడం లేదు. ఇందిరమ్మ పేరును పథకాలకు పెడితే కేంద్రం నుంచి నిధులు ఇవ్వరని అంటున్నారు. ఎలా ఇవ్వరో మేము కూడా చూస్తాం. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా రాష్ట్రానికి ఒక రూపాయి కూడా అదనంగా తీసుకురాలేదు. భారాస పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిన తర్వాత కూడా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నాం. దాన్ని కేటీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే కడుపుమంట తగ్గడానికి ఆయనకు ఈనో ప్యాకెట్లు పంపిస్తామని మా పార్టీ నేతలు అంటున్నారు" అని పొన్నం పేర్కొన్నారు. జగ్గారెడ్డి మాట్లాడుతూ.. ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా పేదలకు ఇందిరమ్మ ఇచ్చిన ఇంటి జాగా, ఇల్లు కనిపిస్తాయన్నారు.

# రైతుభరోసా సొమ్ము నేటి నుంచి బ్యాంకుల్లో తీసుకోవచ్చు : తుమ్మల



**ఖమ్మం :** ఈ ఏడాది రైతుభరోసా కింద ప్రతి ఎకరాకు రూ.12 వేలు ఇవ్వనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రెండు విడతలుగా రూ.12 వేలు ఇస్తామని పేర్కొన్నారు. రైతులకు యాసంగికి పెట్టుబడి సాయం, కూలీలకు రూ.6 వేలు ఆదివారం అర్ధరాత్రి నుంచే ఖాతాల్లో పడతాయని వివరించారు. సోమవారం నుంచి బ్యాంకుల్లో నగదు తీసుకోవచ్చున్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం మల్లేపల్లిలో ప్రజాపాలన గ్రామసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉన్నా రూ.2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేశామన్నారు.
అందుకు రూ.21 వేల కోట్లు చెల్లించామని ప్రకటించారు. పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని అన్నారు. అర్హులైన అందరికీ పథకాలు వస్తాయని స్పష్టం చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఏడాదికి 3,500 ఇళ్లు మంజూరవుతాయని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామన్నారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, జడ్పీ సీఈఓ దీక్షా రైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# సీఎం రైతులకిచ్చిన రుణమాఫీ చెక్కు పాస్ కాలేదు

- ప్రజలు మళ్లీ కేసీఆర్‌నే కోరుకుంటున్నారు
- గజ్వేల్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు

**గజ్వేల్ :** మహబూబ్‌నగర్ రైతు పండగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకిచ్చిన సుమారు రూ.2,550 కోట్ల రుణమాఫీ చెక్కు నెలలు దాటిపోయినా ఇంకా పాస్ కాలేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బల్దియా పాలకమండలి పదవీకాలం ముగింపు సందర్భంగా ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన హాజరై మాట్లాడారు. "పాలమూరు సాగునీటి ప్రాజెక్టులపై భారాస నిర్లక్ష్యం చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ఇద్దరం వెళ్లి అక్కడే ఉన్న కురుమూర్తి ఆలయంలో ప్రమాణం చేసి ఎవరు ప్రాజెక్టులకు ద్రోహం చేశారో తేల్చుకుందాం. రాష్ట్రంలో ఇప్పటికే 400 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అర్హులందరికీ పథకాలని ఇప్పుడు మండలానికి ఒక్క గ్రామమే అంటూ జనవరి 26న కూడా ప్రజలను వంచించారు. దరఖాస్తులు పెట్టుకుంటేనే సంక్షేమ పథకాలు ఇస్తామంటున్నారు. కేసీఆర్ హయాంలో ఏ సభలు లేకుండానే 11 విడతల్లో 69 లక్షల మందికి రూ.73 వేల కోట్లు రైతుబంధు ఇచ్చాం. కొడంగల్‌లో సీఎం తమ్ముడు రాజ్యాంగేతర శక్తిగా మారి కలెక్టర్లతో సలాం కొట్టించుకుంటున్నారు. రాష్ట్రంలో ఎవరిని కదిలించినా మళ్లీ కేసీఆర్ రావాలి.. రాష్ట్రం బాగుపడాలి అంటున్నారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా మళ్లీ భారాస ప్రభుత్వమే ఏర్పడుతుంది" అని హరీశ్‌రావు పేర్కొన్నారు. అనంతరం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బల్దియా ప్రగతి నివేదిక పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షురాలు రోజాశర్మ, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బల్దియా ఛైర్మన్ రాజమౌళి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# రాజ్‌భవన్‌లో ఘనంగా 'ఎట్ హోమ్'

- గవర్నర్ ప్రతిభా పురస్కారాల ప్రదానం
- హాజరైన సీఎం రేవంత్, తాత్కాలిక సీజే జస్టిస్ సుజయ్ పాల్, మంత్రులు



**హైదరాబాద్:** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజ్‌భవన్‌లో ఆదివారం రాత్రి 'ఎట్ హోమ్' కార్యక్రమం ఘనంగా జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరు కాగా.. వీరికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు సాదరంగా స్వాగతం పలికారు. అంతకుముందు రాజ్‌భవన్ హాల్‌లో సీఎం రేవంత్, హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్, కన్హా శాంతివనం వ్యవస్థాపకులు కమలేష్ డి పటేల్ తదితరులతో గవర్నర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం అసెంబ్లీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో 'గవర్నర్ ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రత్యేక జీవితకాల సాఫల్య పురస్కారాన్ని డాక్టర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి, ఐఎఫ్ఎస్ (పర్యావరణ పరిరక్షణ) స్వీకరించారు. వ్యక్తిగత విభాగంలో దుశర్ల సత్యనారాయణ (పర్యావరణ పరిరక్షణ), అరెకపూడి రఘు (వికలాంగుల సంక్షేమం), జీవాంజి దీప్తి (ఆటలు, క్రీడలు), పి.బి.కృష్ణ భారతి (సాంస్కృతిక), ప్రొఫెసర్ ఎం.పాండురంగారావు (సాంస్కృతిక) అందుకున్నారు. సంస్థాగత విభాగంలో ధ్రువాంశ్ ఆర్గనైజేషన్ (పర్యావరణ పరిరక్షణ), ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (వికలాంగుల సంక్షేమం), ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఆటలు, క్రీడలు), సంస్కృతి ఫౌండేషన్ (సాంస్కృతిక) అందుకున్నారు. అనంతరం పద్మవిభూషణ్ పురస్కారం వరించిన డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి (ఏఐజీ ఛైర్మన్), పద్మశ్రీ మంద కృష్ణమాదిగ (ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు)లను గవర్నర్, సీఎం అభినందించి సత్కరించారు. తర్వాత జాతీయ గీతాలాపనతో తేనేటి విందు కార్యక్రమం ప్రారంభమైంది. సీఎం రేవంత్‌తో కలిసి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు అతిథులందరి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, పాల్వాయి హరీశ్, ఎమ్మెల్సీలు కోదండరాం, అమేర్ అలీఖాన్, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ జితేందర్, టీజీఎస్‌పీఎస్‌సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం, గవర్నర్ కార్యదర్శి దానకిశోర్, బాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, స్వాతంత్ర్య సమరయోధులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
27 జనవరి
2025



# అశ్విన్‌కి 'పద్మ' అవార్డు..

## నెట్టింట మాజీల కామెంట్లు వైరల్!



కేంద్ర ప్రభుత్వం 'పద్మ' పురస్కారాలను ప్రకటించింది. భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్‌కు పద్మశ్రీ పురస్కారం వరించింది. అతడికి శుభాకాంక్షలు చెప్పే క్రమంలో మాజీ క్రికెటర్ సుబ్రమణియన్ బద్రినాథ్‌కు మాజీ కోచ్ డబ్ల్యూవీ రామన్ చిన్నపాటి క్లాస్ తీసుకోవడం గమనార్హం. సోషల్ మీడియాలో వారిద్దరి సంభాషణ వైరల్‌గా మారింది. అసలేం జరిగిందో తెలుసుకోవాలంటే ఇది చదివేయాలి.. "పద్మశ్రీ పురస్కారం అందుకొన్న తొలి తమిళనాడు క్రికెటర్ అశ్విన్‌కు శుభాకాంక్షలు. కుర్రాళ్లకు అంతకుమించిన మార్గదర్శి గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఎంతో గర్వంగా ఉంది. ఈ అవార్డుకు పూర్తిగా అర్హుడు" అని బద్రినాథ్ పోస్టు చేశాడు. దానికి స్పందించిన మాజీ కోచ్ డబ్ల్యూవీ రామన్ ఓ పొరపాటు సరి చేస్తూ పోస్టులు పెట్టారు. "వెంకట్రాఘవన్ తొలి తమిళనాడు క్రికెటర్. 2003లోనే ఆయనకు ఈ పురస్కారం వచ్చింది. ఒకవేళ క్రీడాకారుల విషయానికొస్తే ఎంఏ గోపాలన్ మొదటి వ్యక్తి " అని సరిచేశారు. వెంటనే స్పందించిన బద్రినాథ్.. "నా అజ్ఞానానికి క్షమాపణలు కోరుతున్నా. వివరణ ఇచ్చినందుకు ధన్యవాదాలు" అని పోస్టు చేశాడు. "అదేం లేదు. అది అజ్ఞానం కాదు. 2003లో నువ్వు పిల్లాడివి. అది మిస్ అయిందంతే" అని రామన్ సమాధానం ఇచ్చాడు.






# భారత అమ్మాయిల జోరు..

## వరుసగా నాలుగో మ్యాచ్‌లో విజయం

**కౌలాలంపూర్:** అండర్-19 మహిళల టీ20 ప్రపంచ కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత విజయాల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలిచిన భారత జట్టు.. ఆదివారం సూపర్ సిక్స్ గ్రూప్-1లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో సూపర్ విక్టరీ సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్‌ను 20 ఓవర్లలో 64/8కే కట్టడి చేసిన టీమ్ఇండియా.. ఈ స్వల్ప లక్ష్యాన్ని రెండు వికెట్లు కోల్పోయి 7.1 ఓవర్లలో ఛేదించింది. తెలుగమ్మాయి గొంగడి త్రిష (40బీ 31 బంతుల్లో 8 ఫోర్లు) అదరగొట్టింది. భారత్ విజయానికి చేరువయ్యాక త్రిష ఔటైంది. సానికా చాల్కే (11బి) పరుగులు చేయగా.. నిక్కీ ప్రసాద్ (5బి) విన్నింగ్ షాట్ కొట్టింది. కమలిని (3) పరుగులకే వెనుదిరిగింది. భారత్ తదుపరి మ్యాచ్‌లో (జనవరి 28) స్కాట్లాండ్‌తో తలపడనుంది. బంగ్లా జట్టులో స-ుమైయా అక్తేర్ (21బి) టాప్ స్కోరర్. జన్నాటుల్ మౌవా (14) పరుగులు చేసింది. ఫహోమిదా చోయా 2, ఎవా 2, సాదియా ఇస్లామ్ 5, సుమైయా అక్తర్ 5, అశిమా 7, నిశిత 6 పరుగులు చేశారు. భారత బౌలర్లలో వైష్ణవి శర్మ 3 వికెట్లు.. షబ్నామ్, జోషిత, త్రిష తలో వికెట్ పడగొట్టారు.

# రంజీ మ్యాచ్‌లో విరాట్ ఆడతాడా?

## డీడీసీఏ స్పెషల్ ఆఫర్!

దేశవాళీ క్రికెట్‌లోకి భారత స్టార్ ఆటగాళ్లు అడుగు పెట్టారు. రంజీ ట్రోఫీలో టీమ్ఇండియా సారథి రోహిత్ శర్మతో పాటు యువ క్రికెటర్లు యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ ఆడారు. తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైన గిల్ ఆ తర్వాత పుంజుకొని సెంచరీ బాదాడు. స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా కూడా 12 వికెట్లు తీసి సత్తా చాటాడు. ఎలైట్ డివిజన్‌లో మరో రౌండ్ మ్యాచ్‌లు జనవరి 30 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు జరగనున్నాయి. తొలి రౌండ్‌లోనే విరాట్ కోహ్లీ బరిలోకి దిగుతాడని అంతా భావించారు. కానీ, మెడ నొప్పి కారణంగా ఆడలేదు. దీంతో రెండో రౌండ్‌కు తప్పకుండా వస్తాడని దిల్లీ క్రికెట్ సంఘం చెబుతోంది. అందుకు తగినట్లుగానే ఏర్పాట్లనూ చేసేస్తోంది. ఇప్పటి వరకూ కోహ్లీ నుంచి సంకేతాలు మాత్రం రాలేదు. అరుణ్ జైట్లీ స్టేడియంలో రైల్వేస్‌తో దిల్లీ తలపడనుంది. ఇప్పటికే గత మ్యాచ్‌లో ఘోర ఓటమిని చవిచూసిన దిల్లీ ఇప్పుడు విరాట్‌పై ఆశలు పెట్టుకుంది. ఆ జట్టు సారథిగా ఉన్న ఆయుష్ బదోని ఒక్కడే రాణించగా.. రిషభ్ పంత్ చేతులెత్తేశాడు. ఇప్పుడు 13 ఏళ్ల తర్వాత దేశవాళీ బరిలోకి దిగుతున్న విరాట్ కోహ్లీని చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున వస్తారని డీడీసీఏ అంచనా వేస్తోంది. దీంతో భద్రతను పెంచాలని నిర్ణయించింది. సుమారుగా 10వేల మందికిపైగా ప్రేక్షకులు వస్తారని.. దీంతో నార్త్ ఎండ్, ఓల్డ్ క్లబ్ హౌస్‌ను ఓపెన్ చేయాలని నిర్ణయించినట్లు కథనాలు వస్తున్నాయి. అవసరమైతే అదనపు సీటింగ్‌ను సిద్ధం చేయనుంది. టికెట్ల అవసరం లేకుండా.. ప్రతి ఒక్కరికీ ఫ్రీ ఎంట్రీ ఇవ్వనుంది.






### అంతర్జాతీయ క్రికెట్‌లో

# వర్క్‌లోడ్ భిన్నం..

## నితీశ్ ఇంకా పిల్లాడే: చోప్రా

ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ నుంచి తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి వైదొలిగాడు. చెన్నై వేదికగా నిన్న రెండో టీ20 మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ఆ మ్యాచ్ కోసం ప్రాక్టీస్ చేస్తుండగా గాయం కావడంతో అతడు సిరీస్‌కే దూరమైనట్లు బీసీసీఐ వెల్లడిచింది. నితీశ్ స్థానంలో శివమ్ దూబెను సెలక్టర్లు ఎంపిక చేశారు. ఈ క్రమంలో అంతర్జాతీయ క్రికెట్‌లో వర్క్‌లోడ్ విభిన్నంగా ఉంటుందని.. దాని కోసం కఠినంగా శ్రమించాల్సిన అవసరం ఉందని భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా వ్యాఖ్యానించాడు. శివమ్ దూబె ఎంపిక కూడా సరైందేనని పేర్కొన్నాడు. "నితీశ్ కుమార్ సిరీస్ నుంచి వైదొలిగాడు. ఏమైందనే అనుమానం రావడం సహజమే. అయితే, అంతర్జాతీయ క్రికెట్‌లో వర్క్‌లోడ్ విభిన్నం. దేశవాళీతో పోలిస్తే ఇక్కడ ఎక్కువగా ఉంటుంది. ఒకవైపు వర్క్‌లోడ్.. మరోవైపు ఒత్తిడిని హ్యాండిల్ చేయాలి. ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌లో నితీశ్ ఆడాడు. నాణ్యమైన ఆటతీరు ప్రదర్శించాడు. మైదానంలో ప్రతి టెస్టు ఆడేటప్పుడు కనీసం మూడు రోజులపాటు ఉన్నాడు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్... ఇలా ప్రతి విభాగంలో తనదైన పాత్ర పోషించాడు. ఇప్పటికే చాలా అలసిపోయాడు. అతడు ఇంకా చిన్న పిల్లాడే. సుదీర్ఘంగా ఆడేందుకు అతడి శరీరం సిద్ధంగా ఉండదు. గాయం నుంచి కోలుకుని రావడానికి కాస్త సమయం పడుతుంది" అని చోప్రా తెలిపాడు.

### దూబె ఎంపిక సరైందే..

"నితీశ్ కుమార్ దూరం కావడంతో అతడికి బదులు శివమ్ దూబె ను మేనేజ్‌మెంట్ జట్టులోకి తీసుకుంది. ఇది మంచి నిర్ణయమే. అతడిని తీసుకున్నారు? అని కొంతమంది అడగొచ్చు. టీ20 ప్రపంచ కప్‌లో గెలిచిన భారత జట్టులో అతడు సభ్యుడు. ఆ ఫైనల్‌లో కీలకమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఆ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. ఎందుకు ఇలా చేశారని ఎవరూ అడగలేదు. మిగతావారితో పోలిస్తే దూబె ఎక్కువగా వార్తల్లో నిలవడు. అందుకే, అతడిని అంతా మరిచిపోయారు. ఇప్పుడు మళ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టాడు. రింకు సింగ్ కూడా అందుబాటులో ఉండటం లేదు. రమణ్ దీప్‌కి అవకాశం ఇచ్చారు. అయితే, దూబె తుది జట్టులోకి వస్తాడని భావిస్తున్నా" అని తెలిపాడు.



# సినర్‌దే ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్

**మెల్‌బోర్న్:** వరల్డ్ నంబర్ వన్ అయిన యానిక్ సినర్ (ఇటలీ) వరుసగా రెండో ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ సాధించాడు. ఈ 23 ఏళ్ల డిఫెండింగ్ ఛాంపియన్ ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో 6-3, 7-6 (4), 6-3 తేడాతో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)ని మట్టికరిపించాడు. సినర్‌కు ఇది మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్. ఈ క్రమంలోనే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరుసగా రెండు టైటిళ్లు సాధించిన నాలుగో ఆటగాడిగా సినర్ రికార్డు సృష్టించాడు. సినర్ కంటే ముందు ఆండ్రీ అగస్సీ, రోజర్ ఫెదరర్, నొవాక్ జకోవిచ్ వరుసగా రెండుసార్లు విజేతలుగా నిలిచారు. ఫైనల్ మ్యాచ్ తొలి సెట్‌లో సినర్, జ్వెరెవ్ హోరాహోరీగా తలపడ్డారు. ఒకదశలో 3-3 పాయింట్లతో సమానంగా నిలిచారు. కానీ, ఆ తర్వాత సినర్ చెలరేగి సెట్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో సెట్‌లో జర్మనీ ఆటగాడు పుంజుకున్నట్లు కనిపించాడు. 4-3తో లీడ్‌లోకి దూసుకెళ్లాడు. ఇద్దరూ వరుసగా పాయింట్లు సాధించడంతో స్కోరు 6-6తో సమం అయింది. టై బ్రేకర్ ఆరంభంలో జ్వెరెవ్ ఆధిక్యంలో నిలవగా.. సినర్ క్రమంగా పుంజుకుని రెండో సెట్‌ను గెలిచి ఆధిక్యాన్ని పెంచుకున్నాడు. మూడో సెట్ ఆరంభంలో దూకుడుగా ఆడి గట్టిపోటీ ఇచ్చిన జ్వెరెవ్.. తర్వాత డీలా పడిపోయాడు. దీంతో మూడో గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌లోనూ అతను ఓటమిపాలయ్యాడు. అంతకుముందు యూఎస్ ఓపెన్ 2020 ఫైనల్, ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్ 2024లో జ్వెరెవ్‌కు చేదు అనుభవం ఎదురైన సంగతి తెలిసిందే.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News





## పెళ్లిపై జాన్వీ కపూర్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. బాలీవుడ్ ఇండస్ట్రీలో ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి మంచి ఫేమ్ తెచ్చుకుంది. ఇక ఈ భామ వ్యక్తిగత విషయానికి వస్తే.. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి సుశీల్ కుమార్ షిండేకు మనవడైన శిఖర్ పహారియాతో డేటింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. వీళ్లిద్దరూ కలిసి వేకేషన్స్‌కి వెళ్లిన ఫొటోలు వీడియోలు కూడా బయటకు వచ్చాయి. అయితే ఈ రిలేషన్ పై ఈ బ్యూటీ ఇప్పటివరకు స్పందించకపోవడం గమనార్హం. ఇటీవల బాలీవుడ్‌లోని ఓ షోలో ఈ ముద్దుగుమ్మ తన పెళ్లి డ్రీం గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. అయితే ఇంటర్వ్యూలో భాగంగా యాంకర్.. నీ పెళ్లి తర్వాత లైఫ్ ఎలా ఉండాలి అని నువ్వు అనుకుంటున్నావు అని అడిగితే.. దానికి జాన్వీ స్పందిస్తూ.. “నేను పెళ్లి చేసుకొని తిరుమల తిరుపతిలో సెటిల్ అవ్వాలి. ముగ్గురు పిల్లలతో ఉండాలి. రోజూ అరటి ఆకుల్లో తినాలి. రోజూ గోవిందా గోవిందా అని వింటూ ఉండాలి. మణిరత్నం సాంగ్స్ వినాలి. మా ఆయన లుంగీలో ఉండాలి. ఎందుకంటే అది చూడటానికి రొమాంటిక్‌గా ఉంటుంది” అని చెప్పుకొచ్చింది జాన్వీ కపూర్.



## నాకు ఇంకా ఏమి కావాలి

ఆర్ ఎక్స్ 100 సినిమాతో ఫుల్ క్రేజ్ దక్కించుకుంది హీరోయిన్ పాయల్ రాజ్ పుత్. అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కి బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లు కొల్లగొట్టిన ఈ మూవీతో పాయల్ ఓవర్ నైట్ ఫుల్ ఫేమ్ సంపాదించుకుంది. ముఖ్యంగా కుర్రాళ్ల డ్రీమ్ గర్ల్ అయిపోయింది. ఆ తర్వాత కూడా ఈ హాట్ బ్యూటీకి మరిన్ని మంచి అవకాశాలు వచ్చాయి. మధ్యలో పలు సినిమాలు ఫ్లాప్ టాక్ దక్కించుకున్నప్పటికీ.. తర్వాత మంగళవారం చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ వెంకటలచ్చిమి సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈ మూవీ పాయల్ మొదటి పాన్ ఇండియా సినిమా అని చెప్పుకోవచ్చు. ముని దర్శకత్వం వహిస్తోన్న ఈ మూవీని రాజా ఎన్ ఎస్ చౌదరి నిర్మిస్తున్నారు. పాయల్ రాజ్ పుత్ మెయిన్ రోల్‌లో కనిపించనుంది. ఈ హాట్ బ్యూటీ సినిమాల విషయం పక్కన పెడితే.. తాజాగా పాయల్ సోషల్ మీడియాలో అదిరిపోయే ఫొటోలు ఫ్యాన్స్ తో పంచుకుంది. “చీర- చిరునవ్వులు.. నాకు ఇంకా ఏమి కావాలి” అంటూ క్యాప్షన్ కూడా జోడించింది. సింపుల్ శారీలో పాయల్ రాజ్ పుత్ నెటిజన్లను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది.

## ‘మోచ్ఛ మూడ్’లో కృతిశెట్టి

ఉప్పెన చిత్రంతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది బ్యూటీఫుల్ హీరోయిన్ కృతిశెట్టి. మొదటి సినిమాతోనే ఈ నటి తెలుగు ప్రేక్షకుల గుండెల్లో ఓ ముద్ర వేసుకుంది. అబ్బాయి కలల రాణి అయిపోయింది. కృతి క్యూట్ లుక్స్, ఇన్నోసెంట్ ఫేస్, అద్భుతమైన నటనకు జనాలు ఫిదా అయ్యారనడంలో అతిశయోక్తిలేదు. తర్వాత ఈ బ్యూటీకి పలు అవకాశాలు వచ్చినప్పటికీ.. అందులో కొన్ని ఆడలేదు. బుచ్చిబాబు తెరకెక్కించిన ఉప్పెన, శర్వానంద్ సరసన మనమే, రామ్ పోతినేనితో ది వారియర్ తో పాటు మరిన్ని మూవీల్లో నటించి మెప్పించింది. తెలుగులోనే కాకుండా ఈ బేబమ్మ అజయంతే రాండమ్ మోషణం అనే చిత్రంతో మలయాళంలో కూడా నటించి తన సత్తా చాటింది. ఈ మూవీలో టోవినో థామస్ కథానాయకుడిగా నటించాడు. ఈ ఏఆర్ఏం చిత్రానికి భారీ రెస్పాన్స్ లభించింది. ఇదంతా పక్కన పెడితే.. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మకు సినిమా అవకాశాలు తగ్గినప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం అభిమానులతో టచ్‌లో ఉంటూనే ఉంటుంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్ వేదికన బేబమ్మ తన లేటెస్ట్ ఫొటో షూట్ ను అభిమానులతో పంచుకుంది. హాట్ లుక్స్ పిక్స్ పంచుకోవడమే కాకుండా దీనికి మోచ్ఛ మూడ్ అంటూ ఓ క్యాప్షన్ కూడా జోడించింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పిక్స్ వీక్షించిన నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్స్ చేస్తున్నారు.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986